

# ప్రభావం


6-3-562/14
14 విజయ్ అపార్ట్‌మెంట్స్
ఎర్రమంజిల్
హైదరాబాద్ - 500 482.



-గౌతమి


ఉషోదయాన ముఖం కడుక్కొని వచ్చిన జవరాలి నొసటన పూర్తిగా చెరిగిపోని కుంకుమ గుర్తుల్లా ఆ సాయంత్రపు ఆకాశపుటంచుల్లో అస్తమించిన సూర్యుని ఛాయలు ఇంకా పరుచుకునే ఉన్నాయి.

ఇంకా చీకట్లు ముసరని ఎర్రని వెలుగు పర్ణశాల వంటి ఆ ఇంటి ముంగిట పచ్చిక మీద పడి అక్కడ విశ్రమించిన జంటని మురిపిస్తోంది. చుట్టూ పూల మొక్కలు సాయంత్రపు తేటదనాన్ని సంతరించుకొని అపుడపుడే విచ్చుకుంటోన్న పూల సువాసనని వెదజల్లీ వెదజల్లనట్టుగా ఉన్నాయి. సన్నని గాలికి లయగా ఊగుతున్న గడ్డిపోచలు...

మోకాళ్ళ చుట్టూ చేతులు చుట్టి వాటిమీద గడ్డం ఆన్చి యోగిత తన్మయత్వంతో సాయంత్రపు సోయగాల్ని తిలకిస్తోంది. ఆమె ప్రక్కనే పచ్చికలో చేతులు తల కింద పెట్టుకుని పడుకున్న విశ్వమోహన్ లేత గులాబి రేకుల వంటి ఆమె పాదాలకేసి చూస్తూ ఉండి పోయాడు.

ఎంత అందమైన పాదాలు. అతను లేచి ఆమె పాదాలను సుతారంగా ముద్దాడాడు.

ఆమె ఉలిక్కిపడి "ఏమిటండీ ఇది" అంటూ పాదాల్ని వెనక్కి జరుపుకుంది.

"నీకు తెలియదేమో యోగితా, అసలు స్త్రీ పాదాలను వర్ణించని కవి వేస్ట్ - నీ పాదాలైతే మరీనూ నడిచేప్పుడు నెమ్మదిగా కదలి వచ్చే హంసలా కూచున్నపుడు విచ్చుకున్న బంతిలా... అసలు నీలోని సున్నితత్వం అంతా ఈ పాదాల వద్దనే రంగరించుకుని నిన్ను అల్లుకున్నట్టుంటుంది."

ఆమె కళ్ళలో వెలుగు....

"ఏమిటి ఇవాళ శ్రీవారు కవిగార్లై పోతున్నారు!" ఆమె తన చేతి వేళ్ళతో అతని వెంట్రుకలను అల్లరిగా చెరుపుతూ చెప్పింది.

గేటు తీసిన చప్పుడు...

యోగిత అటుగా చూసి "ఏమైనా కావాలా శేఖర్?" అడిగింది లోపలికి వెళ్తున్న అతణ్ణి

"ఏంవద్దు వదినా" అంటూనే పరుగున లోపలికి వెళ్ళి కెమెరాతో బయటకు వచ్చాడు.

"కదలకండి ఫోటో తీస్తాను - ఓ.కే. స్మైల్ ప్లీజ్.. స్టడీ" కెమెరా క్లిక్ మనిపించాడు. అపుడే గుడినుండి తిరిగి వస్తున్న అత్తగార్ని చూసి యోగిత లేచి ఆమె వెంట వెళ్ళింది.

"ఆదేమిటమ్మా అబ్బాయి అక్కడ ఉంటే నా వెంట వస్తున్నావు-భోజనాల వేళకురండి లోపలికి" అని ఆవిడ అంటుండగానే, ఆడపడుచు బిల బిల మంటూ వచ్చి వదినగారికి చక్కిలి గింతలు పెడుతూ పచ్చికమీదికి ఒక్కతోపు తోసి ప్రక్కింటికి తుర్రుమంది.

* * *

కల చెదిరిన యోగిత హడావుడిగా లేచి గడియారం వంక చూసింది. "ఎనిమిది!" ఆమె గుండెలు వేగంగా కొట్టుకున్నాయి. గాబరాగా బాత్రూమ్‌లోకి దూరి ఐదు నిమిషాల్లో బయటకు వచ్చింది.

గబ,గబా తలదువ్వి బొట్టుపెట్టుకుని హాల్లోకి వచ్చింది. మామగారు, మరిది శేఖర్ పేపర్ చూస్తున్నారు. వంటింట్లో అత్తగారి గిన్నెల చప్పుడు.

యోగిత చప్పున లోనికి వెళ్ళి ఆవిడ చూపుల తీక్షణతకి తట్టుకుంటూ "నేను చేస్తానులెండి" అంటూ అత్తగారి చేతిలోంచి గిన్నె తీసుకుంది.

ఆవిడ యోగిత చేతికి గిన్నె ఇచ్చి ప్రక్కకు వచ్చి బయట గిన్నెలు తోముతోన్న పని మనిషినీ, హాల్లో మామగారినీ కేక పెట్టింది.

వాళ్ళు వచ్చాక గడియారం వంక చూపెడుతూ "టైమ్ ఎనిమిది - చూశారుగా - ఇప్పుడు లేచి వస్తోంది - ఇంటి కోడలి లక్షణమేనా ఇది?" మొదటి సారిగా యోగితని డైరెక్టుగా నిలదీస్తోందావిడ.

వదినతో మాట వరసకైనా మాట్లాడని శేఖర్ మధ్యలో దూసుకుని వచ్చి.

" అమ్మా నీకెందుకంత కంఠశోష. ఇన్నాళ్ళూ చేశావు -- ఇక చాలు అక్కడ పడేయ్. ఎవరి పాట్లు వాళ్ళు పడతారు. నీ అంతకు నువ్వు తిని రెస్ట్ తీసుకో అంతే!" తల్లి ప్రేమ ఒలకబోసాడు.

మామగారు చీత్కారపు చూపులు చూస్తున్నారు.

పని మనిషి అదో రకంగా నవ్వుకుంటోంది.

యోగిత తల అవమానంతో కృంగిపోయింది.

ఎవరి చేతా పల్లెత్తుమాట అన్పించుకోని ఆమె సున్నితమైన మనసు ఈ దారుణమైన అనుభవాన్ని భరించలేకపోయింది.

ఈ భూమి చీలి అందులో తను కలిసిపోకూడదూ? ఈ అవహేళనల మధ్య తను శిలనైనా అయిపో కూడదా?

ఆమె నోట మాట రావటం లేదు.

నిన్న అత్తగారి ధోరణి భరించలేక ఎదురు చెప్పినందుకు ఆవిడ తన కక్ష ఇలా తీర్చుకుంటూ

అందరి ముందూ తనుచేసిన తప్పును ఎత్తి చూపుతోంది. ఎలా సమర్థించుకోవాలి.

నిన్న రాత్రి భర్త లేటుగా రావటం, వచ్చాక ఇంకో గంట నిద్ర పోనివ్వకపోవటం, తన వంట్లో బావోలేక బాగా నిద్ర వచ్చే మందులు వేసుకోవటం.. ఇవన్నీ చెప్పుకునే ఆప్తులా వీళ్లు! అసలు చెప్పే అవకాశమైనా ఇచ్చారా?

యోగితకి తల్లి గుర్తొచ్చింది. ఎంత లేటుగా లేచినా.. " అపుడే లేచావేమే - ఇంకాసేపు నిద్రపోకపోయావా - రాత్రంతా కదులుతూనే ఉంటావాయే" అనేది.

నిరసనకి గురైన ఆమె గుండెల్లో తల్లి ప్రేమ కదలాడి కళ్ళల్లో నీటి పొరలు కమ్మాయి.

ఇవేవీ పట్టకుండా విశ్వమోహన్ గదిలో గుర్రుపెట్టి నిద్రపోతున్నాడు. ఇంకో గదిలో ఆడపడుచు మంజుల నిద్రపోతోంది.

తమ వివాహమైన ఈ ఎనిమిది మాసాల్లో ఇదే మొదటిసారి తను ఇంత లేటుగా లేవటం. కాని కొడుకు, కూతురూ ఇద్దరూ ఆది నుండి ఇదే అవలక్షణాన్ని అవలంభిస్తున్నారు.. అయినా వాళ్ళు ఈ తప్పుకు అతీతులు! ఏనాడూ ఎవ్వరిచేతా వాళ్ళలా నిలదీయబడలేదు. ఈ ఒక్క రోజు పొరపాటుకే తనకీ శిక్ష.

ఆవిడకు కూతురు పదింటికి లేచినా మురిపెమే. ఏమిటీ తేడా? అనుక్షణం ఇలాంటి తేడాలే, ఏదో రకంగా నిరసన వ్యక్తీకరణ, అహంతో రాజ్యమేలుతున్న నిరంకుశ స్వభావం... ఎలా...ఎలా... సహించాలి?

ఆమె మానసిక స్థితిని ఏ మాత్రం పట్టించుకోకుండా భర్త ఆఫీసుకు వెళ్ళిపోయాడు. మిగతా వాళ్ళందరూ ఎవరి పని మీద వారు వెళ్ళిపోయారు. ఇహ అత్తగారు చేసే పనేమీ ఉండదు. కొడుకుల ముందర పనిచేసి అలిసిపోయే దానిలాగా స్టంటులు మాత్రం మెండు! ఉదయం కాఫీలు కాచిన భాగ్యానికి అలిసిపోయి పడక వేసేసింది.

యోగిత గుండెల్లో ఏదో తెలీని దుఃఖం, బాధ, ఉక్రోషం. ఒంటిగంట దాకా వంటింట్లో అన్నీ చక్కదిద్ది స్నానమైనా చెయ్యకుండా నీరసంగా తన గదిలోకి వచ్చి పడిపోయింది.

సన్నగా జ్వరం వస్తోందేమో ఒళ్ళంతా నొప్పులు, మనసంతా అవహేళనా భారంతో అగ్నిగోళంలా ఉంది. మెదడంతా ఆలోచనా సుడులు - పెళ్ళయిన దగ్గర్నుండి అత్తవారింట ఎదుర్కొంటున్న సమస్యల వలయాలు! అన్నింటినీ భంగపరుస్తూ పోస్ట్‌మాన్‌కేక.

ఉత్తరం తనకి! కాని చేతివ్రాత ఎవరిదో గుర్తుపట్ట లేక పోయింది యోగిత. ఉత్తరం తీసి చూసింది.



అక్కా అని సంబోధించి ఉంది. క్రింద సంతకం చూస్తే 'స్నేహ' అని ఉంది. యోగితకు విస్మయం కల్గింది. స్నేహ తన క్లోజ్‌ఫ్రెండ్ వినత చెల్లెలు, తన కెందుకు రాసినట్లు అనుకుంటూనే చదవసాగింది.

బావున్నావా? నేనెందుకు రాస్తున్నానా అని ఆశ్చర్యపోతుంటావు కదూ. నాకో ప్రాబ్లమ్ వచ్చింది. వినతక్కకు రాస్తే నీ సలహా తీసుకోమంది. మా కాలనీలోనే ఒక అబ్బాయి ఆరు మాసాలుగా నా పట్ల తన ప్రేమని ఎక్స్‌ప్రెస్ చేస్తూ వస్తున్నాడు. ఇన్నాళ్ళూ నేను మౌనమే వహించాను.

కాని రోజులు గడుస్తున్న కొద్దీ అతని ప్రేమలో నిజాయితీని స్పష్టంగా చూడ గల్గుతున్నాను. నాకు తెలీకుండా నేను కూడా అతని ప్రేమలో పడిపోయా నేమో. కాని మా కులాలు వేరు నీకు తెలుసుగా అక్కా,నాన్నగారు అసలు ఒప్పుకోరు..

ఆ అబ్బాయి నేను ఒప్పుకుంటే ఎలాగైనా తన పేరెంట్స్‌ని ఒప్పిస్తానంటున్నాడు. ఒప్పుకోకపోయినా ఇద్దరం దూరంగా వెళ్ళిపోయి బ్రతుకు దామంటు న్నాడు. నాకు ఏం చెయ్యాలో తోచక అయోమయంగా ఉంది.

చదువు మీద ఇంట్రెస్ట్ తగ్గిపోతోంది. రోజులు దిగులుగా గడిచిపోతున్నాయి. అతని ప్రేమని తిరస్కరించలేక పోతున్నాను. అలా అని అందరికీ ఎదురు తిరిగి నిలబడే ధైర్యం లేకుండా పోతోంది. నన్నేం చేయమంటావ్? త్వరగా రిప్లయి రాస్తావు కదూ? చూస్తూఉంటానేం.. సెలవ్!

నీ స్నేహ

యోగిత ఆరోజంతా ఆలోచించి స్నేహకి లెటర్ రాయటం మొదలుపెట్టింది.

స్నేహా!

నువ్వు ఏదో ఒక నిర్ణయం తీసుకునేముందు నా ఎనిమిది మాసాల వైవాహిక జీవితానుభవం కాస్తా చెప్పనివ్వు.

నీకు తెలుసుగా కట్నం ఇవ్వలేని నన్ను విశ్వమోహన్ వాళ్ళ అమ్మతో పోట్లాడి ఒప్పించి ఎలా పెళ్ళి చేసుకున్నాడో.

అందరూ నా అదృష్టాన్ని కొనియాడారు. కాని నా జీవితం అందరికీ కన్పించే పూలపాన్పు కాదు. విశ్వమోహన్ భలే చిత్రమైన మనిషి. తన వరకు మంచివాడే కాని ఇంట్లో జరిగే ఏ విషయాన్నీ పట్టించుకోడు. ఎంతసేపూ ఆఫీస్, ఆ తర్వాత ఇంట్లో ఎంత దారుణమైన చర్చ జరగనీ సర్దుకోవాలి అంటాడు. అంత ఆదర్శవంతంగా పెళ్ళి చేసుకున్నవాడు తప్పుని తప్పని ఖండించకపోవటం ఆశ్చర్యం కాదూ?

నా అభిప్రాయాలేమిటో తెలుసుకోడు.. నాతో ఇంటిమేట్‌గా ఉండటం కాని, ఏకాంతంగా గడపాలని కాని అనుకోడు. అతని ఈ రకమైన ప్రవర్తన నాకు ఎంతటి ఎదురుదెబ్బో వివరించలేను. మనిషి మనస్తత్వం పైకి కన్పించినంత సులభంగా ఉండదు.

ఇహ మా ఇంట్లో మిగతా సభ్యులందరూ కల్సి ఒక్కటై నాతో పోట్లాడ్తారు. ఈపోరాటం మా ఆయనకు తెలియకుండానే సాగుతూ ఉంటుంది. నిత్యమూ ఆయనకి తెలిసే నిర్లక్ష్యమో లేక తెలిసికో లేని అమాయకత్వమో అంతుపట్టదు.

కట్నం తేలేని కోడల్ని కిరసనాయిల్ పోసి చంపక్కర్లేదు. చావగొట్టి హింసించనక్కరలేదు. ఇంట్లో మాటలతోనే అన్నీ చేసేయవచ్చు. మా అత్తగారు అనుక్షణం నా స్తోమతని గుర్తు చేస్తూ ఉంటుంది. కట్నం ఇవ్వనందుకు వాళ్ళ అడుగులకి మడుగులొ త్తుతూ బానిసలా పడి ఉండాలని పరోక్షంగా శాసిస్తూ ఉంటుంది.

ఇంట్లో వాళ్ళ అవసరాలన్నీ చూస్తూ గొడ్డు చాకరీ చేసే కోడలిపట్ల కనీసపు కన్సర్న్ ఉండదు. కట్నం తేనందుకు అది కాంపెన్సేషన్ అనుకుంటా..

ఏదో వయసు మళ్ళిన ఆవిడ కదా ఏపనీ చెయ్యకపోయినా ఏ పుస్తకాలో, టీ.వీ.నో చూసుకుని కాలం వెళ్ళబుచ్చవచ్చును కదా అలాకాదు. ప్రతీ విషయంలో కలగజేసుకొని తన డామినేషన్ చూపించుకుంటుంది.

ఇంట్లో స్వీట్స్, ఫ్రట్స్ అందరూ తింటూ ఉంటారు. ఒక్కరైనా 'నువ్వు తిన్నావా? తిను' అని అనరు. అలాంటిది నా బాధ్యతా నిర్వహణలో ఏ చిన్న నిర్లక్ష్యం జరిగినా భూకంపం వచ్చినట్టు ఊగిపోతారు.

ఇహ మా మామ గారు అత్తగారి పాటకు పంత పాడుతూ ఉంటారు.

మంజుల అనే మా ఆడపడచు నాకు ఇంకో లైన్‌లో ప్రత్యర్థి! నేనూ, విశ్వమోహన్ ఇద్దరం ఏకాంతంగా కలుసుకోకుండా అతి జాగ్రత్త వహిస్తూ ఉంటుంది రాత్రి పదకొండు దాకా! ఇంతకన్నా దౌర్భాగ్యం ఇంకేం ఉంటుంది చెప్పు?

నా గురించి చాలా రాసి బోర్ కొట్టించాను కదూ... ఇదిగో నీపాయింటికి వస్తున్నా. అందరికీ ఇలాంటి పరిస్థితులే వస్తాయని కాదు.కాని పెళ్ళి ఒక్కటే స్త్రీ సమస్యకు పరిష్కారం కాదు. అది పెద్దవాళ్ళకు... రిలీఫ్! అసలు స్త్రీ సమస్యలు పెళ్ళితోనే మొదలౌతాయి.

కట్నం ఇచ్చే స్తోమతలేని ప్రతీ ఆడపిల్ల ముందు తనకంటూ ఒక ఉద్యోగం లేదా ఆర్థిక పరంగా ఏదో ఒక సపోర్ట్ చూసుకుని ఆ తర్వాతే పెళ్ళి గురించి ఆలోచించాలి. వ్యక్తిగతమైన గెలుపుకి ఆర్థిక బలం అత్యవసరం.

స్నేహా! సహజంగా నీవు తెలివైన దానివి. ఈ దశలో నీకు స్టడీస్ ముఖ్యం. నీకు వీలైనంత వరకూ చదువుకుని నీదంటూ ఒక హోదాని ఏర్పర్చుకో. నువ్వన్నట్టు అతని ప్రేమ నిజమైనదే అయితే మీ ఇద్దరూ స్థిరపడే దాకా ఏ అవాంతరాలొచ్చినా నీ ప్రేమ నిలిచే ఉంటుంది.

ఇంకొకరి సమస్య మీద మూడోవ్యక్తి తేలిగ్గానే సలహాలివ్వగలడు. కాని సమస్య నీది... బాగా ఆలోచించి నువ్వే సరైన నిర్ణయాన్ని తీసుకోగలవని ఆశిస్తూ ముగిస్తున్నాను.. బై...

**యోగిత.**

**కొద్ది రోజుల తర్వాత స్నేహ దగ్గర నుండి ఒక గ్రీటింగ్ కార్డు వచ్చింది. రెక్కలు విరిగి కిందపడిన పక్షిని చూస్తూ ఆకాశంలోకి రివ్వునదూసుకువెళ్తోన్న ఇంకో పక్షి బొమ్మ అది! లోపల ఇలా ఉంది...**

**యు హావ్ ఇన్స్‌పైర్డ్ మై కాన్ఫిడెన్స్**

**యు హావ్ ఎన్‌లైటెన్ మై పాత్ ఆఫ్ లైఫ్**

**ఐ విల్ ప్రూవ్ మై సెల్ఫ్!**

**థాంక్యూ సో మచ్!!**

**తన ఉత్తరం ఒక వ్యక్తిని ఇంత ప్రభావితం చెయ్యటం యోగితలో మనోధైర్యాన్ని పెంచింది. ఆ రాత్రి ఆమె నిద్రపోయే ముందు మనసులో అనుకుంది...**

**తన జీవితంలో మార్పుకు కూడా ఇదే వేదిక కావాలి! విశ్వమోహన్‌ని కదిలించి మలచు కోవాలి. ఇంట్లో ఎవరి లిమిట్స్ వారు తెలుసుకునేలా చెయ్యాలి. తన పాత్రకి మెరుగులు దిద్దుకుని వెలుగులోకి తీసుకు రావాలి. అలా నిశ్చయిం చుకున్నాక ఆ రోజు ఆమె హాయిగా నిద్రపోయింది.★**